క్లుప్తంగా

ఈవూరికి ఇన్‌చార్జిపై స్థానికుల సంబరాలు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

చెరుకుపల్లి: ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఈవూరి గణేష్ రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులైన సందర్భంగా చెరుకుపల్లి గ్రామంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. డాక్టర్ ఈవూరి గణేష్ వైద్యశాల వద్ద యువకులు బాణ సంచా కాల్చి గణేష్ జిందాబాద్ అంటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రేపల్లె ఐఆర్‌ఈఎఫ్ అధినేత రెబ్బా ఇమ్మానియేల్ గణేష్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. చెరుకుపల్లి ఐలాండ్ సెంటర్ సమీపంలో డాక్టర్ ఈవూరి గణేష్‌కు రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు.

16న మండల సర్వసభ్య సమావేశం

భట్టిప్రోలు: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న మధ్యాహ్నం 2:30 గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జంపని(వేమూరు): జంపనిలోని అయోవ బాలికల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. 1972 నుంచి 1975 వరకు చదువుకున్న విద్యార్థులు పాఠశాలలో ఒక్కటయ్యారు. పాఠశాలలో చదువుకుని, ఉన్నత ఉద్యోగాలు చేపట్టడం జరిగిందని, విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు.

అర్ధనారీశ్వరగా బగళాముఖి దర్శనం



చందోలు(కర్లపాలెం): చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారు భక్తులకు మీనాక్షి సుందరేశ్వర స్వరూపంలో(అర్ధనారీశ్వర) భక్తులకు దర్శనమిచ్చారు. కార్తిక మాసం మంగళవారం అమావాస్య సంధర్బంగా బగళాముఖి అమ్మవారికి అర్ధనారీశ్వర అలంకరణ చేశారు. కార్తీక మాసం ముగియనున్నందున భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

తుపాను బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత



బాపట్ల: తుపాను బాధితులకు రెడ్‌క్రాస్ బాపట్ల శాఖ సాయం చేసేందుకు ముందుకొచ్చింది. చైర్మన్ బీఎస్ నారాయణభట్టు ఆధ్వర్యంలో 50 మంది గిరిజనులకు టార్పాలిన్ పట్టలు, హైజీన్ కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. బాలింతలకు వంట సామగ్రి అందించారు. నారాయణభట్టు మాట్లాడుతూ రాజీవ్‌నగర్‌లో గిరిజనులకు 50కి పైగా ఉన్నారని తెలిపారు. వీరు పూరిగుడిసెల్లో ఉన్నారని తెలిపారు. సభ్యులు ఎండీ సాదిక్, రమణబాబు, పి.బాలకృష్ణ, భావనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా రాష్ట్రంలో పాలన

- సీఎం వైఎస్ జగన్‌తోనే ఉజ్వల భవిష్యత్తు
- ఎమ్మెల్యే కోన రఘుపతి


సంక్షేమం పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు కావాలనే కార్యక్రమం మండలంలోని కంకటపాలెం గ్రామంలో మంగళవారం జరిగింది. ప్రజాధరణ మధ్య కార్యక్రమం కొనసాగింది. గ్రామంలో ప్రజలకు అందించిన సంక్షేమం కార్యక్రమాలపై బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ నిత్యం ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ సీఎంగా చేసుకోవటంతో రాష్ట్రాభివృద్ధి చెందుతుందని తెలిపారు. నియోజకవర్గంలో అడిగిందే తడువుగా నిధులు ఇస్తున్నట్లు చెప్పారు. కంకటపాలెం, జమ్ములపాలెం రోడ్డును కలుపుతూ రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. మెడికల్ కళాశాల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని చెప్పారు. నల్లమడ డ్రెయినేజీ ఆధునీకీకరణ పనులు కూడా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. భావితరాలకు మెరుగైన జీవితాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీలు తమ ఉనికిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని, ప్రజా బలాన్ని చూసి తట్టుకోలేకనే విమర్శలు చేస్తున్నాయని కోన దుయ్యబట్టారు. కంకటపాలెంలో పూర్తిస్థాయి అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్ కొక్కిలిగడ్డ చెంచయ్య, వడ్డిముక్కల డేవిడ్, ఈఓపీఆర్డీ శరత్‌బాబు పాల్గొన్నారు.

ముగిసిన కార్తిక శోభ


సూరేపల్లిలోని వాయులింగానికి అభిషేకాలు చేస్తున్న భక్తులు

భట్టిప్రోలు: వెల్లటూరులో కొలువైన గ్రామ దేవతలు ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయంలో కార్తిక మాసం మంగళవారం సత్యన్నారాయణ స్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అర్చకులు క్రోవి రామకృష్ణ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెదపులివర్రులోని రాజరాజ నరేంద్రస్వామి ఆలయంలో ఆమంచి సృజన్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ మేకా సాంబశివరావు, దేవస్థాన కమిటీ చైర్మన్ జంపని అంజయ్య ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కార్తిక మాసం దేవాలయంలో మొత్తం 30 ఏకాదశి రుద్రాభిషేకాలు, 29 మాస లీలా కల్యాణోత్సవాలు జరిగాయని తెలిపారు. సూరేపల్లిలోని కేదారేశ్వర వాయులింగ దేవస్థానంలో స్వామికి భక్తులు స్వయంగా అభిషేకాలు నిర్వహించారు. మల్లేశ్వరునికి ప్రత్యేక అలంకరణ గావించారు.

నేడు ఐలవరంలో పంచ మండపాల పూజ

భట్టిప్రోలు: ఐలవరంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి పంచ మండపాల పూజ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హోమ గుండం, అభిషేకాల కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



బాపట్ల: ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పాటుగా ఉంటుందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కలను మంగళవారం ఆయన అందజేశారు. ఈస్ట్ బాపట్ల చెందిన కె.అంకమ్మకు రూ.1.70లక్షలు, బసిరెడ్డిపాలేనికి చెందిన మున్నం అంకిరెడ్డికి రూ.70వేలు, చందోలుకు చెందిన ఆవుల మధులతకు రూ.30వేలు సాయంగా అందించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, ఆట్ల ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

శుభదినం గీతా జయంతి

వెల్లటూరు(భట్టిప్రోలు): కౌరవులు, పాండవులు యుద్ధం ప్రారంభించే ముందు ప్రభోధం పొందారని గీతా ప్రచార మండలి జ్ఞానాశ్రమ పీఠాధిపతులు పందిరి శ్రీశైలం అన్నారు. మండలంలోని వెల్లటూరు గీత ప్రచార మండలి జ్ఞానశ్రమంలో మంగళవారం కార్తిక శుద్ధ బహుళ అమావాస్య పర్వదినాన శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడికి గీత ప్రభోధం చేసిన శుభదినం పురస్కరించుకుని ప్రపంచ శాంతి గీత తత్వ జ్ఞాన కర్పూర యజ్ఞం నిర్వహించారు. ఉదయం గీతాచార్య శ్రీ కృష్ణ భగవానులకు మేలుకొలుపు, సహస్ర నామార్చన పూజలు జరిగాయి. అనంతరం ముఖ ద్వారం వద్ద వేణుగోపాలస్వామి ప్రతిష్ఠ, గీతా జ్ఞాన కర్పూర యజ్ఞం జరిగింది. జ్ఞానాశ్రమ పండితులు వంగర చలమయ్య సిద్ధాంతి, వేములపల్లి వనజాక్షి, పమిడిముక్కల శకుంతలదేవి, ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, నిర్వాహకులు క్రాప రవికుమార్ పాల్గొన్నారు. భగవద్గీతపై పీహెచ్‌డీ చేసిన గీతా గురుజీ పందిరి శ్రీశైలంను గీతా ప్రచార మండలి ఘనంగా సన్మానించింది.

సంస్కృతి, సంప్రదాయాలను ఆచరించాలి


శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రిన్సిపల్ సుధాకరరావు

రేపల్లె: విద్యార్థి వయస్సు నుంచే సంస్కృతి, సంప్రదాయాలు తెలిసి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.సుధాకరరావు అన్నారు. కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కార్తిక మనసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రపంచ దేశాలలో భారతదేశానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. భిన్నసంస్కృతులు, పండగలు, ఆచారాలను భవిష్యతరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ప్రతిభావంతులైన విద్యార్థులకు సుధాకరరావు తన తల్లిదండ్రులు పార్లపల్లి తిరుపతమ్మ–గాలయ్య జ్ఞాపకార్థం బహుమతులు ప్రదానం చేశారు. బాపట్ల జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కళాశాల గణిత అధ్యాపకుడు కె.శ్రీనివాసరావును సత్కరించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బిల్లా జవహర్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శివప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు


కరపత్రాలు ఆవిష్కరణ

బాపట్ల అర్బన్ : సాంస్కృతిక విభాగం, పర్యావరణ సబ్ కమిటీ, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, అభ్యుదయ భావాల వేదిక ఆధ్వర్యంలో కుల, మత రహిత కార్తిక వన మహోత్సవం నిర్వహించారు. మంగళవారం ముత్తాయపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకృతిలో మార్పులు, పర్యావరణ పరిరక్షణపై జేవీసీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కె.ఆదినారాయణ రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని అన్నారు. కుల, మత రహిత వన మహోత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వంతోపాటు, స్వచ్ఛంద సంస్థలు, అభ్యుదయ వాదులు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.సుందరరాజు, పి.శివయ్య, సరిత, భారతి, స్కూల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 154 మంది విద్యార్థినుల ఎంపిక


ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థినులతో కళాశాల అధ్యాపక బృందం

బాపట్ల అర్బన్: బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో పలు కంపెనీల ప్రతినిధులు ప్రాంగణ ఎంపిక నిర్వహించారు. విద్యార్థినులు 154 మంది ప్లేస్‌మెంట్ సాధించారు. మంగళవారం జరిగిన అభినందన సభలో బాపట్ల ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్స్ డి. రామ్మోహన్‌రావు, జి. దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ కె, హరి పద్మ ప్రసాద్, ట్రెజరర్ టి. రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.జి. శ్రీనివాసరావు ఎంపికైన విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్మెంట్ కో–ఆర్డినేటర్ జి. దివ్య, శశికళ, సాయిలక్ష్మి, చైతన్య, కుమారి, వైస్ ప్రిన్సిపల్ ఐ.హరిత, విభాగాధిపతులు పాల్గొన్నారు.


నేడు మండల సర్వసభ్య సమావేశం

కర్లపాలెం: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

14 నుంచి మహాయాగాలు

గుంటూరు రూరల్: నగర శివారులోని ఇన్నర్ రింగ్‌రోడ్డు నందున్న శ్రీ చైతన్య కళాశాల గ్రౌండ్‌లో ఈ నెల 14 నుంచి 22 వరకు అష్టలక్ష్మి మహా యాగాలు, లక్ష్మీనారాయణుల కల్యాణం నిర్వహించనున్నట్లు యాగ కమిటీ నిర్వాహకులు కన్నసాని శ్రీనివాసు తెలిపారు. మంగళవారం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని గ్రౌండ్‌లో యాగాల బ్రోచర్స్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. విశ్వగాయత్రి పీఠం ఉపాసకులు వెల్లటూరి ప్రసాదచారి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 22వ తేదీన ఉదయం మహామంగళ పుర్ణాహుతి, సాయంత్రం కోటి తలంబ్రాలతో లక్ష్మీనారాయణుల కల్యాణం జరుగుతుందన్నారు.

ప్రాడిజి విద్యాలయం వార్షికోత్సవం



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత భవిష్యత్తు దిశగా కృషిచేయాలని సీబీఎస్ఈ విజయవాడ రీజినల్ ఆఫీసర్ శేఖర్‌చంద్ర పేర్కొన్నారు. మంగళవారం బుడంపాడు గ్రామంలోని ప్రాడిజి విద్యాలయం 6వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్య అంటే మార్కులు, ర్యాంకులు ఉదయం నుంచి రాత్రి వరకు స్కూల్, ట్యూషన్ అని భావించి పిల్లలను విపరీతమైన ఒత్తిడికి నెట్టడం కాదని, చిన్నారుల మానసిక, శారీరక, సాంస్కృతిక, సామాజిక వికాసాన్ని పిల్లలలో పెంపొందించడమని తెలిపారు. అటువంటి విద్యను అందిస్తున్న ప్రాడిజి విద్యాలయం యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా అకడమిక్ టాపర్స్, వివిధ క్రీడలలో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అతిథులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరింపజేశాయి. పాఠశాల కరస్పాండెంట్ సూర్యకుమారి, పీఈటీ లిల్లిష, బాల భార్గవి, ప్రియాంక, పి.శశి, డి రాజ్యలక్ష్మి, షేక్ నసీమ, వై.భవిష్య, డాన్స్ మాస్టార్‌లు చిన్న, సన్ని, సాయి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేగంగా పంట నష్టం నమోదు


కొల్లూరులో పంటను పరిశీలిస్తున్న తహసీల్దారు, ఏఓ


బుద్ధాంలో పైరును పరిశీలిస్తున్న అధికారులు


చందోలులో పంట నష్టం నమోదు

కొల్లూరు: మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన పంట నష్ట నమోదు ప్రక్రియ మంగళవారం మండలంలోని 16 ఆర్‌బీకేల పరిధిలో జరిగింది. ప్రాథమికంగా వరి 7,337, మినుము 570 ఎకరాల విస్తీర్ణం, అరటి 400, పసుపు 180 ఎరాల్లో నష్టపోయినట్లు అంచనాలు రూపొందించారు. మండలంలోని వరి, మినుము, అరటి, పసుపు, తమలపాకు పంటలను పరిశీలించి, నష్టాలను నమోదు చేశారు. తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఏఓ వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో పర్యటించి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

పారదర్శకంగా పంట నష్టం అంచనాలు

కర్లపాలెం: మిచాంగ్ తుపానుకు నష్టపోయిన పంటల వివరాలను పారదర్శకంగా నమోదు చేస్తున్నామని ఏవో ఎం.సుమంత్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని బుద్ధాం, పెదపులుగువారిపాలెం, చింతాయపాలెంలో మంగళవారం జరుగుతున్న పంట నష్టం నమోదు కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. మండల పరిధిలోని 15 సచివాలయాల పరిధిలో పంట నష్టం నమోదు జరుగుతుందని మంగళవారం 1,024మంది రైతులకు సంబంధించి 641హెక్టార్లలో పంట నష్టం అంచనా వేయటం జరిగిందన్నారు. రైతులు తమ పొలాల వద్దకు బ్యాంకు అకౌంటు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్‌లు తీసుకునివచ్చి నష్టం వివరాలు నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు పంచాయతీ కార్యదర్శులు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి ఎకరం నమోదు

పిట్టలవానిపాలెం (కర్లపాలెం): తుపాను ప్రభావానికి మండల పరిధిలో నష్టానికి గురైన ప్రతి పైరును నమోదు చేసి, రైతులకు నష్ట పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు కవిత అన్నారు. పంట నష్టం నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఏవో సత్యానందం, తహసీల్దారు పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు 33 శాతం నష్టం వాటిల్లిన పైర్ల వివరాలను నమోదు చేస్తున్నామని చెప్పారు. మంగళవారం మండల పరిధిలో 1,026 మంది రైతులకు సంబంధించి 881హెక్టార్లలో పైర్లు నష్టానికి గురైనట్లు గుర్తించి, నమోదు చేశామని చెప్పారు. ఈకార్యక్రమంలో వీఆర్వోలు, వ్యవసాయాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ


కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

రేపల్లె రూరల్: క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడా సంబరాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివ పార్వతి అన్నారు. ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు సచివాలయాల పరిధిలో జరగనున్న క్రీడలకు సంబంధించిన కిట్‌లను పట్టణంలోని మండల విద్యావనరుల కేంద్రంలో సచివాలయాల సెక్రటరీలకు మంగళవారం ఆమె పంపిణీ చేశారు. సచివాలయాల స్థాయిలో క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు క్రికెట్, బాస్కెట్ బాల్, వాలీ బాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నీకాయిడ్, మారథన్ వంటి క్రీడలను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కేసనశెట్టి సురేష్, ఎ.రత్నశేఖర్, ఉపాధ్యాయులు, సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


గేట్ ధర్నాలో పాల్గొన్న యూనియన్ నాయకులు

రేపల్లె రూరల్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో అధ్యక్షుడు బ్రహ్మారాజు అన్నారు. సమస్యల సాధనకై నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన సమయంలో మంగళవారం నిర్వహించిన గేటు ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2017 పీఆర్‌సీ ఆరియర్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను కార్మికులకు వెంటనే చెల్లించాలన్నారు. గ్యారేజ్‌లో స్పేర్ పార్ట్‌లు, ఖాళీ పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిపో సెక్రటరీ దారం చిట్టి బాబు, చైర్మన్ కారంకి శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.రామస్వామి, ఎం.రాజేష్‌కుమార్, గ్యారెజ్ సెక్రటరీ రాజభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా అభ్యంతరాలపై దృష్టి సారించాలి


అధికారులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి మోహనరావు

వేమూరు: ఓటర్ల నమోదు, జాబితాపై అభ్యంతరాలపై అధికారులు దృష్టి సాధించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి జె.మోహనరావు తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వివిధ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఎన్నికలు జరిగే వరకు ప్రతి మంగళవారం వివిధ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అందు వల్ల వివిధ పార్టీల నాయకులు సమావేశానికి హజరు కావాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు నాగరాజు, శ్రీనివాసరరావు, దుర్గ పాల్గొన్నారు.